ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY







భూ చోళ్లు!

నగరంలో రెచ్చిపోతున్న భూమాఫియా

- కోట్ల విలువైన భూములపై కన్ను
- సీటీఆర్‌ఐలో 56 ఏళ్ల కిందట ప్లాట్లు
- 32.09 ఎకరాల్లో 268 విభజన
- పబ్లిక్ సర్వెంట్స్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు
- ప్రస్తుతం 29 స్థలాలు అన్యాక్రాంతం
- ఒక్కో ప్లాట్‌పై నాలుగు రిజిస్ట్రేషన్లు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- రూ.2 కోట్ల విలువ.. రూ.కోటికే రిజిస్ట్రేషన్
- కోర్టులో కేసు ఉన్నా సాగిన వ్యవహారం
- లిక్విడేటర్ రక్షించలేని పరిస్థితి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే యోచన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

భూమాఫియా బరితెగించింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తోంది. ప్రభుత్వ స్థలమైనా..ప్రైవేటు స్థలమైనా ఆక్రమిస్తోంది. సామాన్య మధ్యతరగతి ప్రజలు రూపాయి.. రూపాయి కూడబెట్టుకుని కొనుగోలు చేసిన స్థలాలు రక్షించుకోవడం కష్టమైపోతోంది. ప్రస్తుతం ఆ భూమాఫియా గుప్పెట్లో సీటీఆర్‌ఐ ప్రాంతం భాస్కరనగర్‌లోని 19975 నాటి రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలాలు ఉన్నాయి. ఆయా స్థలాలు ఆక్రమించి మూడు నాలుగు రిజిస్ట్రేషన్లు చేసిన దాఖలాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఇంత జరుగుతున్నా ఏ ఒక్కరూ నోరుమెదపకపోవడం శోచనీయం.

1968లో ప్లాట్ల విభజన..

రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్ కో ఆపరేటివ్ సొసైటీ 1968లో మార్కెట్ విలువ (సబ్ రిజిష్టర్ వేల్యూ) ప్రకారం 32.09 ఎకరాలు కొను గోలు చేసింది.ఆ భూములు 111, 114,117, 118,119, 120, 121/1, 122/1,135 సర్వే నెం బర్లలో ఉన్నాయి.ప్రభుత్వం 1975లో ఈ భూమిని 254 ప్లాట్లుగా కేటాయించింది. అవిగాక క్రాస్ బిట్లు 14 ఉన్నాయి.ఈ స్థలాలు పొందడానికి లబ్ధిదారుడు ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండాలి. కనీసం 21 ఏళ్ల వయస్సు ఉండాలి. అప్పట్లో ఏం జరిగిందో కానీ చాలా మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కొందరు చేయించుకోలేదు.కొందరికి 2 నుంచి 3 ప్లాట్లు కేటాయించారు. కానీ అధికా రికంగా రిజిస్ట్రేషన్ మాత్రం ఒక ప్లాట్‌కే జరిగింది. ఈ విషయం తెలియడంతో భూమాఫియా కన్ను ఆ స్థలాలపై పడింది.ఆక్రమించుకోవడం, వేరేవారికి అమ్మేయడం ఇలా ఇప్పటి వరకూ చాలా ప్లాట్లు మూడు నాలుగు చేతులు మారాయి.ఇది పెద్ద వివాదం కావడంతో గతంలో విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. సొసైటీ సభ్యులు ఎవరూ లేకపోవడంతో సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థాయి అధికారిని ప్రభుత్వం ఇక్కడ లిక్విడేటర్‌గా నియమించి వీటిని రక్షించే బాధ్యత అప్పగించింది. కానీ పరిస్థితిలో మార్పు లేదు.అన్యాక్రాంతం జరుగుతూనే ఉంది.

29 ప్లాట్లు అన్యాక్రాంతం

254 ప్లాట్లలో 160 జన్యూన్‌గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. 15 ప్లాట్లు అన్యా క్రాంతమైనట్టు అధికారులు గుర్తించారు. క్రాస్ బిట్లుగా ఉన్న 14 అంటే మొత్తం 29 బిట్లు ఆక్రమణకు గురయ్యాయి.78 ప్లాట్లను వెరిఫికేషన్ చేయ వలసి ఉంది. ఏ శక్తులు పనిచేస్తున్నాయో కానీ వెరిఫికేషన్ జాప్యం అవుతోంది. వీటికి సంబంధించిన రికార్డులను ఎవరో మాయం చేశారు. సబ్- రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఒక్కొక్కటి బయటకు తీస్తున్నారు.తర్వాత ఎవరో లిటిగేషన్ పెడుతున్నారు.దీంతో ఇక్కడ నిత్యం ఏదో వివా దం జరుగుతూనే ఉంది. ప్రస్తుతం కోర్టులో ఆరు ప్లాట్లు ఒకరికే రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతంపై కేసు నడుస్తోంది. కానీ సర్వే నంబర్ 121/1లోని 249 నంబరు ప్లాట్, 250 ప్లాట్‌కు సంబంధించి తాజాగా మరో వివాదం చెలరేగింది.వై.జయలక్ష్మి తనకు 1970లోనే రెండు ప్లాట్లు అలాట్ అయ్యాయని..వాటికి లిక్విడేటర్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని 2017లో జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కోర్టు ఆమెకు ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవలసిందిగా ఆదేశించింది.కానీ అధికారులు ఆమె రికార్డులు పరిశీలించగా ఆమెకు అర్హత లేదని,ఆమె ప్రభుత్వ ఉద్యోగి కాదని.. పైగా ఆమెకు కేటాయించినట్టు చెబుతున్న నాటికి 18 ఏళ్ల వయసులోపే మైనర్‌గా ఉందని రివ్యూపిటిషన్‌ను కోర్టులో వేశారు. ఈలోపు గత నెలలో 249వ ప్లాట్‌ను కె.కె.వెంకటరెడ్డి, 250వ ప్లాట్‌ను కె.బాపిరెడ్డి అనే వ్యక్తులకు రాజమ హేంద్రవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజి స్ట్రేషన్ చేసినట్టు లిక్విడేటర్ చంద్రశేఖర్ తెలి పారు. జయలక్ష్మి ఆ రోజు మజ్జి వీరభద్రరావు అనే వ్యక్తిపేర స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ రాసి గత నెల 20న రాజమహే ంద్రవరం సబ్- రిజి స్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి నట్టు చెబుతున్నారు. ఇటీవల బదిలీ అయిన సబ్- రిజిస్ట్రార్ రిలీవ్ అయ్యే సమయంలో ఈ పని పూర్తిచేసినట్టు ప్రచారం జరుగుతోంది.ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున సొమ్ములు చేతులుమారినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

స్థలాలన్నీ లిటిగేషన్..

ప్రస్తుతం ఆ ప్రాంతంలో గజం మార్కెట్ విలువ రూ.30 వేల వరకూ ఉంది. మొత్తం ఒక్కో ప్లాట్ 346 గజాల్లో ఉంది.దానిని కేవలం రూ.47.52 లక్షలకు అమ్మేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. వాస్తవానానికి ఒక్కో స్థలం విలువ రూ.కోటి పైనే. రెండు ప్లాట్లు రూ.2కోట్లపైనే. కానీ ఇక్కడ ఎవరి మధ్య డబ్బు చేతులు మారిం దో కానీ తక్కువ ధరకే రిజిస్ట్రేషన్ అయి పోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న ట్టు లిక్విడేటర్ ఈ సంగతిని ఇటీవల తమ ఉన్నతాధికారులకు తెలియజేశారు. క్రిమినల్ కేసు పెట్టే యోచనలో ఉన్నారు. ఇక్కడ అనేక ప్లాట్లు వివాదాల్లో ఉన్నాయి. ఉన్నతాధికారులు కూడా కొనుక్కుని ఇరుక్కుపోయారు. అన్యాక్రాంతమైన స్థలాలన్నీ భూమాఫియా ఇప్పటికే అనేక చేతులు మార్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇక్కడ దందా జరిగింది. ఈ వ్యవహారం అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు ఉన్నట్టు సమాచారం. ఇక్కడ మొత్తం ఆక్రమణలకు గురైన స్థలాలు కొన్ని కోట్ల విలువ చేస్తాయి. ప్రభుత్వం దృష్టిపెట్టి వీటిని స్వాధీనం చేసుకుంటేనే ఇక్కడ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. వాస్తవంగా అర్హత ఉన్నవారికి దక్కేలా చేసి రికార్డులులేని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.

జై దుర్గ



కరుణించమ్మా.. దుర్గమ్మా : కోరుకొండ రోడ్‌లో కలశాలతో 300 మంది మహిళల ఊరేగింపు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7 : జై దుర్గ.. జైజై దుర్గ అంటూ భక్తులు ఊగిపోయారు.. దుర్గమ్మను కొలుస్తూ ముందుకు సాగారు. రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్ ప్రాంతం సోమవారం కనకదుర్గమ్మ నామస్మరణతో మారుమ్రోగింది. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోరుకొండ రోడ్డులోని సాయి కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. జొన్నాడ వీరవెంకట సుబ్బారావు శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో 300 మంది మహిళలు కలశాలతో ఊరేగింపు చేశారు. ఊరేగింపు ముందు గిరిజన సాంప్రదాయ నృత్యం కొమ్ముడ్యాన్సుల ప్రదర్శన జరిగాయి. హిందూ సనాతన ధర్మ పరిరక్షణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన దీక్షకు మద్దతుగా ఆలయ కమిటి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి పాలబిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీను హాజరయ్యారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంటిపూడి శ్రీనివాస్ పద్మా వతి, దుద్దిపూడి శ్రీనివాస్, పద్మావతి ,జొన్నాడ వీరవెంకట సుబ్బారావు, శ్రీదేవి ,మాజీ కార్పొరేటర్లు పాలవలస వీరభద్రం, జవ్వాది మురళీకృష్ణ, దుర్గ, పినిశెట్టి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌లు కొవ్వూరు డిపోకు రావాలి

ఆర్టీసీ ఆర్ఎంకు సూచించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 7 : కొవ్వూరు డిపో నుంచి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కొవ్వూరు పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్‌లు రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి కొవ్వూరు మీదుగా ఏలూరు, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయాలని ఎవరు మీకు ఆర్డర్ ఇచ్చారని ప్రశ్నించారు. బస్సులన్నీ గామన్‌బ్రిడ్జి పైనుంచి కొవ్వూరు డిపోకు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొవ్వూరు పట్టణంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక..ఆర్టీసీ బస్సులు రాకపోతే ప్రజలు ఎలా ప్రయాణం చేస్తారని ప్రశ్నించారు. పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని కొవ్వూరు డిపోకు కొత్త బస్సులను కేటాయించాలన్నారు.దీనిపై స్పందించిన ఆర్ఎం కొవ్వూరు డిపో నుంచి విజయవాడ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే టీవీ. రామారావు, బోడపాటి ముత్యాలరావు, పెనుమాక జయరాజు ఉన్నారు.

విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడవద్దు

ఉపాధ్యాయులకు డీఈవో వాసుదేవరావు సూచన



దివాన్‌చెరువు, అక్టోబరు 7 : ఉపాధ్యాయులు విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడవద్దని డీఈవో వాసుదేవరావు సూచించారు. దివాన్‌చెరువులోని ఒక ప్రైవేటు కార్యక్ర మంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినులకు ఉపాధ్యాయులకు మధ్య 5-6 అడుగులు దూరం పాటించి విద్యాబోధన చేయాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. వార్షిక విద్యాకాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తిచేసే విధంగా చర్యలు చేట్టామన్నారు. అన్నితరగతుల్లోనూ విద్యార్థులు అభ్యాసనాసామర్థ్యాలు వారి స్థాయికి తగిన విధంగా ఉండేలా ప్రాథమికస్థాయి నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా అన్ని పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులును కేటాయించామని తెలిపారు.

డీఎస్‌వోగా ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 7: జిల్లా సివిల్ సప్లయిస్ అధి కారిగా ప్రసాదరావు నియమితులయ్యారు.ఈయన గతంలో రాజమహేంద్రవరంలో పనిచేశారు.అటుపై ఉమ్మడి తూర్పుగోదావరి, కృష్ణా,గుంటూరు జిల్లాల్లో పనిచేశారు.కర్నూలు డీఎస్‌వోగా పనిచేస్తూ బదిలీపై తూర్పుగోదావరికి వచ్చారు.ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడును కలిశారు.

టెట్‌కు 50 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగిందని డీఈవో వాసుదేవరావు తెలిపారు. ఉదయం సెషన్‌లో 240 మంది అభ్యర్థులకు 220 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 240 మందికి 210 మంది హాజరయ్యారన్నారు.

15 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పొడిగించారని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. మెరిట్ పరీక్ష డిసెంబరు 8న జరుగుతుందన్నారు. ఎస్‌బీఐ కలెక్ట్ ద్వారా చెల్లించిన రుసుము రసీదు ఒరిజినల్‌ని ఈ నెల 17వ తేదీలోపుగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు www.bse.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయన్నారు.

రేపు మంత్రి నాదెండ్ల మనోహర్ రాక

కొవ్వూరు, అక్టోబరు 7 : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో పర్యటిస్తారని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.రాధిక తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాయంత్రం 4 గంటలకు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, జేసీ ఎస్.చిన్నరాముడు తదితరులు పాల్గొంటారన్నారు.

డమ్మీ ఇళ్ల పట్టాలపై విచారణ 7

ఎకరా ఆదాయం రూ.2 లక్షలు



ఖోఖో సాగు..బాగు బాగు

- లాభాలు కురిపిస్తున్న పంట
- భారీగా పెరిగిన ధర
- కిలో గింజలు రూ.1050
- 14 వేల హెక్టార్లలో పంట
- మారిన రైతుల చూపు
- అంతరపంటగా సాగు
- ప్రభుత్వ సబ్సిడీ రూ.20 వేలు

పెరవలి/చాగల్లు, అక్టోబరు 7 : ఖోఖో సాగుపై జిల్లా లో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ శాతం కొబ్బరిలో అంతరపంటగా వేస్తున్నారు. మిగిలిన పంటలతో పోలిస్తే ఖోఖో పంట సిరులు కురిపిస్తుండడమే కారణం. ఈ ఏడాది జనవరి నుంచి ఖోఖో గింజల రేటు అత్యధికంగా పెరగడంతో రైతులకు లాభాల పంట పండింది. గతంలో అన్‌సీజన్‌లో రూ.150 ఉండే గింజల ధర సీజన్‌లో రూ.200 నుంచి రూ.240 వరకు పలికేది. ఈ ఏడాది అయితే ఒక్కసారిగా వంద నుంచి రూ.200 చొప్పున పెరుగుతూ కేజీ గింజలు ధర రూ.1050 వరకు చేరింది. ప్రస్తుతం వర్షాకాలంలో గింజల నాణ్యత పెద్దగా లేకున్నా కేజీ గింజల ధర రూ.350 వరకు ఉందని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం

గత నాలుగేళ్లుగా కొబ్బరి దిగుబడి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.గతంలో ఖోఖో తోటలు రైతులు అంతంత మాత్రంగానే వేశారు. ప్రస్తుతం రేటు బాగుం డడంతో ఎక్కువ శాతం ఖోఖో మొక్కలు వేయడానికి సిద్ధమవుతున్నారు. సాధారణంగా కొబ్బరిలో అరటి, కూరగాయలు, పూల తోటలు అంతర పంటలుగా వేస్తారు. గత పది నుంచి 15 ఏళ్ల ఖోఖో సాగు చేస్తున్నప్పటికి గింజల ధర అంతంత మాత్రంగా ఉండడంతో పెద్దగా రైతులు మొగ్గు చూపలేదు.ఖోఖో మొక్కలు నాటిన 2 నుంచి మూడేళ్ల తరువాత మాత్రమే కాపు మొదలవుతుంది. ఎకరానికి ఎంత లేదన్నా 4 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్ల వరకు వస్తుందని రైతులు చెబుతున్నారు.సరాసరి రేటు కేజీ రూ.500 చూసుకున్నా క్వింటాకు రూ.50 వేలు పైగానే వస్తుంది.ఈ లెక్కన ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. కోత ఖర్చులు, ఎరువులు మిగిలిన ఖర్చులు రూ.50 వేలు తీసివేసినా ఎకరానికి రూ.2 లక్షలు పైగానే ఆదాయం వస్తున్నట్టు రైతులు చెబుతున్నా రు. ఖోఖో సాగు ఎక్కువగా ఆఫ్రికా దేశాల్లో ఉం టుంది. కొత్తగా కౌలుకు తీసుకునే వారికి కొబ్బరిలో ఖోఖో ఉన్న తోట ఎకరా రూ.లక్ష నుంచి రూ. లక్ష 25 వేలుపలుకుతోంది.గతేడాది ఇవే తోటలు ఎకరా రూ.60 వేలు నుంచి రూ.80 వేలు ఉండేది. కొబ్బరి విడిగా ఎకరాకు రూ.50 వేలు,ఖోఖోకు రూ.50 వేల నుంచి రూ. 80 వేల వరకు పలుకుతుంది. తోటల దిగుబడి ఆధారంగా రేటు ఉంటుంది.

14 వేల హెక్టార్లలో సాగు..

జిల్లావ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో ఖోఖో సాగు చేస్తున్నారు.కొవ్వూరు ఉద్యానవన శాఖ పరిధిలోని చాగల్లు మం డలంలో కొబ్బరి 6,200 ఎకరాల్లో ఉండగా అంతరపంటగా ఖోఖో 5,170 ఎకరాల్లో ఉంది. కొవ్వూరు మండలంలో 430 ఎకరాలకు 298 ఎకరాల్లో ఖోఖో ఉంది. పెరవలి మండలంలో 700 ఎకరాలకు 185 ఎకరాల్లో, తాళ్లపూడి మండలంలో 245 ఎకరాల కొబ్బరిలో ఖోఖో 196 ఎకరాల్లో, ఉండ్రాజవరం మండలంలో 620 ఎకరాలు కొబ్బ రిలో 59 ఎకరాల్లోను ఖోఖో ఉంది. జిల్లా వ్యాప్తం గా మెట్టప్రాంత మండలాల్లో ఎక్కువగా కొబ్బరిలో ఖోఖోను అంతరపంటగా సాగుచేస్తున్నారు. కొబ్బరి తో పాటు పామాయిల్ తోటల్లో కూడా ఖోఖో మొక్కలు పెంచవచ్చునని కొబ్బరితో పోల్చితే దిగుబడి తగ్గుతుం దని చెబుతున్నారు. క్యాడ్‌బరి కంపెనీతో పాటు చాక్లెట్స్ తయారు చేసే కంపెనీలు కొనుగోలు చేస్తుంటాయి. బోర్నమిటా, బూస్ట్, కేక్‌ల తయారీలో ఈ పౌడర్ విని యోగి స్తుంటారు.దీని వల్ల భవిష్యత్తులో కూడా ఖోఖో ధరకు ఏ మాత్రం ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.20 వేల సబ్సిడీ..

ఖోఖో సాగు చేసే రైతులకు ప్రభుత్వం మూడేళ్ల పాటు సబ్సిడీ మొత్తం అందజేస్తుంది. మొదటి సంవత్సం రూ.12 వేలు, రెండో సంవత్సం, మూడో సంవత్సం రూ. 4 వేలు వంతున మొక్కలు కొనుగోలు, ఇతర మందులు, ఎరువులకు అందజేస్తారు.ఖోఖో ఆశాజనకంగా ఉండ డంతో వరి, చెరకు పండే నల్లరేగడి నేలల్లో సైతం రైతులు సాగుచేయడానికి ఆసక్తిని చూపుతున్నారు.

300 హెక్టార్లలో కొత్తగా సాగు



ఈ ఏడాది 300 హెక్టార్లలో కొత్తగా ఖోఖో మొక్కలు నాటారు. ఒక హెక్టార్‌కి రూ.20 వేలు ప్రభుత్వ సబ్సిడీ వస్తుంది. ఒక్కొక్క మొక్క ఖరీదు రూ. 12లుగా ఉంది. రైతులు ముందుగా సొమ్ము చెల్లించి మొక్కలు కొనుగోలు చేసుకుని తీసుకెళ్లాలి. అనంతరం రైతుల ఖాతాల్లో సొమ్ములు పడతాయి.

- శ్రీనివాస్, కొవ్వూరు డివిజన్ ఉద్యాన అధికారి



సమస్యలతో క్యూకట్టారు!

- కిటకిటలాడిన కలెక్టరేట్
- మౌలిక వసతులకు అర్జీలు
- 141 వినతుల స్వీకరణ
- పరిష్కరించాలని ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 7: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు.దీంతో కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రజలు ఇళ్ళు ,పింఛన్లు, మౌలిక సదుపాయాల కల్పనకు అర్జీలు పెట్టుకున్నారు. సోమవారం ఉద యం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ పి.ప్రశాంతి,జేసీ చిన్నరాముడు, డీఆర్ వో జి.నరసింహులుతో కలిసి అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా ఇళ్ళు, పింఛన్లు, రేషన్‌కార్డులు, అంత్యోదయ కార్డులు,శానిటేషన్, విద్యు త్ సరఫరా సమస్యలు, భూ ఆక్రమణలు, తాగునీరు, మురుగు నీటి పారుదల సమస్యలు, టిడ్కో ఇళ్ళు తదితర సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ సూచనలు చేశారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ విభాగానికి 58 ,పంచాయతీరాజ్‌కు 25, హోమ్‌శాఖకు 16, పౌరసరఫరాల శాఖకు 8, ఆర్ డబ్ల్యూ ఎస్ కు 7,ఇతర శాఖలకు 27 అర్జీలు వచ్చాయి. మొత్తంగా 141 అర్జీలు స్వీకరించారు.

8 ఏళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం

కాతేరుకు చెందిన బిమాల నాగమణి 2016లో చంద్రబాబు చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకంలో లబ్ధిదారుగా ఉంది. ఆ ఇంటి నిమిత్తం అప్పట్లో అప్పుచేసి రూ.1లక్ష చెల్లించింది. అటుపై అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. ఆ రూ.లక్షకు ఇప్పటికీ వడ్డీ కడుతున్నా. డబుల్ బెడ్ రూమ్ ఇంటికి సంబంధించి బ్యాంక్ వాళ్ళు మార్టగేజ్ అవ్వలేదని రూ.3 లక్షలు చెల్లించాలని చెబుతున్నారు. ఇప్పటికే అప్పులపాలై ఉన్న తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కలెక్టర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చేది ఇందుకేనా సార్!



కలెక్టర్ పనిలో కలెక్టర్ ఉంటే.. అధికారుల పనిలో అధికారులు ఉన్నారు.. ప్రజలు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అర్జీలు ఇస్తుండడంతో మిగిలిన అధికారులు మాకేంటి పని అంటూ సెల్‌లో కాలక్షేపం చేస్తూ కెమెరాకు చిక్కారు. కలెక్టరమ్మా.. ఈ అధికారులు పీజీఆర్ఎస్‌కు వచ్చేది ఇందుకేనా!

ఎస్పీ 'మీ కోసం'కు 34 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం(మీ కోసం) కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఎస్పీ నరసింహ కిషోర్ అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ బాధ్యులకు ఫోన్ చేసి తగు ఆదేశాలు ఇచ్చారు. చట్టానికి లోబడి న్యాయం చేయాలని సూచించారు. మొత్తం 34 అర్జీలను ఎస్పీ స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) సుబ్బరాజు, ఎస్ఐ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహకిశోర్



లక్ష్మీదేవి అలంకారంలో రాజరాజేశ్వరీ దేవి

కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కరెన్సీతో అలంకరించారు. - పిఠాపురం



భువనేశ్వరి పీఠంలో మహా చండీదేవిగా...

పట్టణంలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారు మహా చండీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. - పెద్దాపురం



బాలాత్రిపురసుందరిగా వాసవీ మాత

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట బస్టాండు వద్ద గల శ్రీవాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. - అంబాజీపేట



గోకవరంలో మహా చండీదేవిగా...

తూర్పు గోదావరి జిల్లా గోకవరం దేవీచౌక్ సెంటర్లో శ్రీకనకదుర్గ అమ్మవారు సోమవారం మహా చండీదేవిగా దర్శనచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. - గోకవరం



కల్యాణ గౌరీదేవిగా రత్నగిరి వనదుర్గ

రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ సోమవారం కల్యాణ గౌరీదేవిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించి తరించారు. ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. - అన్నవరం

గాయత్రీదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక

▸▸ కాకినాడ శ్రీపీఠంలో ఐదో రోజుకు మహాశక్తి యాగం



సర్పవరం జంక్షన్, అక్టోబరు 7: వేలాది మంది మాతృమూర్తుల దుర్గాదేవి నామస్మరణతో మహాశక్తి యాగం ఆధ్యాత్మిక మణిహారమైంది. కాకినాడ రమణయ్యపేటలో శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో యాగం సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. అమ్మవారిని గాయత్రీదేవిగా విశేషాలంకరణ చేశారు. గాయత్రి, సౌర హోమాలు నిర్వహించిన అనంతరం గ్రహ దోష పరిహారం కోసం లక్ష నారికేళ పూజ ఘనంగా నిర్వహించారు. పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ లలితా సహస్ర నామాల్లో మనల్ని శక్తివంతులుగా మారేలా అమ్మవారి అనుగ్రహం ఉంటుందన్నారు. భారతీయ సంస్కృతిలో సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవం అన్నారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

శ్రీబాలాత్రిపురసుందరి దేవిగా దుర్గాదేవి

దేవీచౌక్‌కు పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దుర్గాదేవి అమ్మవారు సోమవారం శ్రీబాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపి మంగళహారతులిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపకాంతుల నడుమ దేవీచౌక్ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కుర్రకారు బూరాలు ఊదుతూ సందడి చేశారు. రాత్రి ప్రదర్శితమైన సత్యహరిశ్చంద్ర నాటకం పలువురిని ఆకట్టుకుంది.



విజయ డెయిరీ నుంచి వచ్చిన నెయ్యిని దిగుమతి చేస్తున్న అధికారులు, నాణ్యతను పరిశీలిస్తున్న ఈవో రామచంద్రమోహన్

సత్యదేవుని సన్నిధికి విజయ డెయిరీ నెయ్యి

అన్నవరం, అక్టోబరు 7: తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి నాణ్యతపై ఆరోపణల నేపథ్యంలో అన్నవరం దేవస్థానం అధికారులు ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిపై జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో రివర్స్ టెండరింగ్ ద్వారా పలు కంపెనీల నుంచి టెండర్లు స్వీకరించి ఎల్-1 కాంట్రాక్టరుకు నెయ్యి సరఫరా చేసేందుకు అనుమతులిచ్చేవారు. అయితే పాత కాంట్రాక్టరు గడువు సెప్టెంబరు 30తో పూర్తయ్యింది. కొత్తగా పిలిచిన టెండర్లలో ఎల్-1గా తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీస్ టెండరు దక్కించుకుంది. అయితే తిరుమల వ్యవహారంతో అధికారులు ఆ కాంట్రాక్టును హోల్డ్‌లో పెట్టి ప్రభుత్వ ఉత్తర్వులు కోసం ఎదురుచూశారు. ప్రభుత్వ ఉత్తర్వులు రాకపోవడం, రత్నగిరిపై నెయ్యి నిల్వలు నిండుకుండడంతో విజయ డెయిరీ నుంచి తాత్కాలికంగా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. 7వేల కిలోలకు ఆర్డర్ పెట్టగా సోమవారం 4,500 కిలోల నెయ్యిని ఆ కంపెనీ సరఫరా చేసింది. మిగిలిన 2,500 కిలోలను ఒకట్రెండు రోజుల్లో అందిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. నెయ్యి నాణ్యత, వాసనను ఈవో రామచంద్రమోహన్ పరిశీలించారు.



అనపర్తి తహసీల్దారు కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న స్వామినాయుడు

డమ్మీ పట్టాల తయారీపై విచారణ

అప్పటి డిప్యూటీ తహసీల్దారు శశిధర్, వీఆర్వోలను విచారించిన టూరిజం డిప్యూటీ డైరెక్టర్ స్వామినాయుడు

అనపర్తి, అక్టోబరు 7: అనపర్తి తహసీల్దారు కార్యాలయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 24న వెలుగు చూసిన డమ్మీ ఇంటి పట్టాల వ్యవహారంపై టూరిజం డిప్యూటీ డైరెక్టర్ స్వామి నాయుడు సోమవారం విచారణ చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థల సేకరణ, లబ్ధిదారుల ఎంపిక జరగకుండా తహసీల్దారు కార్యాలయ సిబ్బంది పట్టాలను పంపిణీకి సిద్ధం చేశారు. వాటిని గుర్తించిన టీడీపీ శ్రేణులు అప్పటి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో ఆందోళన నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు శశిధర్‌ను పట్టాలతో సహా పట్టుకుని నిలదీశారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన టూరిజం డిప్యూటీ డైరెక్టర్ స్వామినాయుడు మాట్లాడుతూ అప్పుడి డిప్యూటీ తహసీల్దారు శశిధర్‌తో పాటు కొంతమంది వీఆర్వోలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నామన్నారు. పలువురు టీడీపీ నాయకులు కూడా వివరాలు అందజేశారని, పూర్తి వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీలో 'నది' షూటింగ్ సందడి

వరరామచంద్రాపురం, అక్టోబరు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఆదిత్యవర్మ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'నది' చిత్రంలోని పలు సన్నివేశాలను గిరిజన గ్రామమైన గుల్లేటివాడ పరిసర అటవీ ప్రాంతాల్లో చిత్రీకరిస్తు న్నారు. సీనియర్ నటుడు నాజర్, ముంబయి నటి నందితాదాస్ నటిస్తున్నారు. 15 రోజుల పాటు షూటింగ్ జరుగుతుందని సమాచారం.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

▸▸ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ▸▸ దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర టోర్నమెంటు ప్రారంభం

దివాన్‌చెరువు, అక్టోబరు 7: విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర టోర్నమెంటును సోమవారం ఆయన తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సంపూర్ణ వ్యక్తిత్వవికాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ యువత క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే స్వామి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంటులో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 350 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. తొలుత జాతీయ పతాకాన్ని మంత్రి దుర్గేష్, ఎస్‌జీఎఫ్ పతాకాన్ని ఎమ్మెల్యే బత్తుల, జిల్లా పతాకాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ఆవిష్కరించారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టరు సీహెచ్ విజయప్రకాష్, పరిశీలకుడు నాగేంద్ర, ఎంఈవో-2 జ్యోతిప్రసాద్, నాయకులు వంక మల్లిబాబు, దేశాల శ్రీను, వాసిరెడ్డి రాంబాబు, యర్రంశెట్టి శ్రీను, పలివెల బులిరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్. వేదికపై ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయప్రకాష్, డీఈవో వాసుదేవరావు

కూరలు అమ్ముతుండగా
వ్యాన్ ఢీకొని మహిళ మృతి



మృతురాలు రమణమ్మ (పాత చిత్రం)

కొత్తపల్లి, అక్టోబరు 7: సంత మార్కెట్లో మసాలా సామాన్లు విక్రయించేందుకు వస్తున్న వ్యాన్ అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన చందక రమణమ్మ (55) కూరగాయల వ్యాపారం చేస్తోంది. సోమవారం సంత కావడంతో సాయంత్రం నాలుగు గంటలకు కూరగాయలు అమ్ముతోంది. మసాల సామాన్లు విక్రయించేందుకు వస్తున్న వ్యాన్ అదుపు తప్పి రమణమ్మను బలంగా ఢీకొనడంతో దుర్మరణం చెందింది. కూరగాయలు కొనుగోలు చేస్తున్న రాయుడు అప్పారావుకు కాలు విరిగింది. సంఘటనా స్థలాన్ని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్‌తో పాటు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రమణమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేష్ చెప్పారు.

టీచర్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా గోపిమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఏలూరు అర్బన్, అక్టోబరు 7: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో నిర్వహించనున్న ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా యూటీఎఫ్ పశ్చిమ గోదావరి జిల్లా నాయకుడు బి.గోపిమూర్తిని సంఘ రాష్ట్ర నాయకత్వం ఎంపిక చేసింది. ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో గోపిమూర్తి పరిచయ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు ఏపీ ఎన్జీవోల సంఘం, ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ, హెచ్ఎంల సంఘాల జిల్లా నాయకులను, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సూర్యారావు మాస్టారుని యూటీఎఫ్ నాయకులు కలుసుకుని ఎన్నికల్లో గోపిమూర్తికి మద్దతునివ్వాల్సిందిగా అభ్యర్థించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ 1998లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన నాటి నుంచి ఉపాధ్యాయ, ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నానన్నారు. అప్రంటీస్ వ్యవస్థ రద్దు, సీపీఎస్ రద్దు పోరాటాలు ముఖ్యమైనవన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రథమ ప్రాధాన్యతా ఓటును తనకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తొలుత దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి, సంఘ రాష్ట్ర మాజీ నాయకుడు ఎస్ఆర్ పోలిశెట్టి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపిమూర్తికి ఎన్జీవోల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్, రామారావు, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ రమణ, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్ మద్దతు తెలిపారు.

సొసైటీలో దొంగతనానికి
పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, అక్టోబరు 7: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు సొసైటీలో నగదు, మోడెమ్ చోరీ చేసిన నిందితుడిని పట్టణ పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దగొన్నూరు గ్రామానికి చెందిన గుబ్బిలి సుబ్రహ్మణ్యాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.5వేలు రికవరీ చేసి రిమాండ్ నిమిత్తం కొవ్వూరు కోర్టులో హాజరుపరిచినట్టు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.



పెద్దాపురం మండలం తాటిపర్తిలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

పిఠాపురం, పెద్దాపురంల్లో విజిలెన్స్ తనిఖీలు

33.30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం, అక్టోబరు 7: రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ ఎం.స్నేహిత ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో సోమవారం దాడులు నిర్వహించారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఐషర్ వ్యాన్‌లో తరలిస్తున్న 13.2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రూ9.62 లక్షలు విలువైన బియ్యం, వ్యాన్‌ను సీజ్ చేశారు. బియ్యం రవాణా చేస్తున్న గొల్లప్రోలు పట్టణానికి చెందిన వెలుగుల వాసు, వేన్ డ్రైవర్ వెలుగుల గుర్రయ్యపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పిఠాపురం పట్టణ పోలీసులకు సూచించారు.

పెద్దాపురం: మండలంలోని తాటిపర్తి గ్రామంలో తుమ్మలపల్లి నాగబాబు తన ఇంట్లో 41 బ్యాగుల్లో 2010 కేజీల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. పక్కా సమాచారం అందడంతో పోలీసులు సోదా చేసి గుర్తించారు. పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.17కి కొని సమీపంలో ఉన్న ఇటుక బట్టీ కార్మికులకు రూ.21కు విక్రయిస్తున్నాడు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం విలువ సుమారు రూ.1,00,460. రేషన్ బియ్యాన్ని, తూకపు యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం క్రయ, విక్రయాలు జరుపుతున్న తుమ్మలపల్లి నాగబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పెద్దాపురం పోలీసులకు సూచించారు. ఈ రెండుచోట్లా సెక్షన్ 6 (ఎ) కింద కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, జీవానందం, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తుల సవరణకు అవకాశం

పెద్దాపురం, అక్టోబరు 7: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారు ఈ నెల 8, 9 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా సవరించుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



బీచ్ ఫ్రంట్‌ని సందర్శిస్తున్న బాలాజీ

కాకినాడ బీచ్ అభివృద్ధికి కృషి

ఏపీ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 7: కాకినాడ బీచ్‌ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్ ఫ్రంట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ వంటి పథకాల ద్వారా పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి నూతన పర్యాటక విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. బీచ్ ఫ్రంట్‌లో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాల పూర్తికి, పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి పసుపులేటి పోశయ్య, ఏఈ వెంకటేష్, ఏపీవో త్రిమూర్తులు పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ ఉద్యోగి గుండెపోటుతో మృతి

దేవరపల్లి, అక్టోబరు 7: తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన నాగిరెడ్డి గంగయ్య ప్రభు (48) మండలంలోని యర్నగూడెం 3ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం ఉదయం ఎ-షిఫ్ట్‌లో పని చేస్తుండగా ఛాతీలో నొప్పి వస్తోందని సహచర ఉద్యోగులకు తెలిపాడు. దీంతో తూర్పుగోపు నవీన్‌బాబు ప్రభుని ఫ్యాక్టరీ వాహనంలో దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.

విద్యుత్ షాక్‌తో
సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ దుర్మరణం



తిరునావ్ అరసు (పాత చిత్రం)

మోతుగూడెం, అక్టోబరు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ తిరునావ్ అరసు (55) విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందాడు. పోలీస్ స్టేషన్ వద్ద భద్రత విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ పోలీసులు ఆదివారం రాత్రి డొంకరాయి నుంచి మెట్టగూడెం గ్రామ శివార్లలో గల అటవీ ప్రాంతానికి వెళ్తుండగా తిరునావ్‌కు విద్యుత్ షాక్ తగిలింది. అడవి జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ వైరు తగిలి ఆయన చనిపోయినట్టు కూంబింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది గుర్తించారు. తిరునావ్‌ను వెంటనే డొంకరాయి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం చేసి చింతూరు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్తుంగా మార్గమధ్యంలో చనిపోయాడు. తిరునావ్ తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా వీరకుట్టిపాల్యం ప్రాంతానికి చెందినవాడు.

సంచార ప్రదేశాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే
కఠిన చర్యలు: ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



మోతుగూడెం, అక్టోబరు 7: సంచార ప్రదేశాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. వ్యవసాయ, అటవీ భూముల్లో సంచార ప్రదేశాల్లో అక్రమంగా, అనధికారికంగా విద్యుత్ తీగలు అమర్చి జంతువులకు, మానవులకు హాని కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏజెన్సీ సమాచారం

పథకాల పునరుద్ధరణకు చర్యలు

గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే శిరీషదేవి



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శిరీషదేవి

వై.రామవరం, అక్టోబరు 7: అర్హత ఉండి కోల్పోయిన పథకాల పునరుద్ధరణకు చర్యలు చేపడతానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు. వై.రామవరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె పాల్గొని 200 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వై.రామవరం-గుర్తేడు రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తహశీల్దారు అనసూయ, ఎంపీడీవో బాపన్నదొర, పంచాయతీ కార్యదర్శి మధుసూదన రాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు రమణారెడ్డి, పుష్పరాజు, రామలక్ష్మి, సీనియర్ నాయకుడు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 43 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రంపచోడవరం, అక్టోబరు 7: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, ఏపీవో (జీ) డీఎన్‌వీ రమణ 43 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను పీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్డీసీ జాన్‌రాజ్, డీఎల్పీవో రఘునందన్, ఏపీడీలు డేగలయ్య, జి.శ్రీనివాసరావు, డీఎల్డీవో కె.కోటేశ్వరరావు, డీఈవో మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతన చట్టం మేరకు కూలి చెల్లించాలి

రంపచోడవరం, అక్టోబరు 7:వెదురు, జామాయిల్ తదితర అటవీ కూపుల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం కూలి రేట్లు చెల్లించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలానికి వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ నాయకుడు కుంజా దూలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.780 చెల్లించాలన్నారు. వారానికి ఒకసారి సొమ్ము చెల్లించాలని, పని సమయంలో ప్రమాదం జరిగి కార్మికుడు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. ఏఐకేఎంఎస్ నాయకులు కె.బాలురెడ్డి, పి.లచ్చిరెడ్డి, కె.బాలుదొర, విండెల రామారావు, కత్తుల సుగ్గిరెడ్డి, మడి ప్రసాద్, ఇల్ల బాలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలి

దేవీపట్నం, అక్టోబరు 7: దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి శాశ్వత భవనాలు మంజూరు చేయాలని తహశీల్దారు వి.రామకృష్ణకు సోమవారం వినతిపత్రం ఇచ్చినట్టు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. దీనిపై తహశీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎకరంన్నర స్థలాన్ని గతంలోనే కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, నాయకుడు యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోతుగూడెం గ్రామ కార్యదర్శిగా మోహన్



మోతుగూడెం, అక్టోబరు 7: మోతుగూడెం మేజర్ పంచాయతీ కార్యదర్శిగా గుంపెనపల్లి మోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట నుంచి బదిలీపై వచ్చారు. మోహన్‌ను సర్పంచ్ ఆకేటి సీత, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు తదితరులు అభినందించారు. ఇక్కడ పని చేసిన రవినాయక్ పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లి విధుల్లో చేరారు.

చండీమాత అవతారంలో అమ్మవారు

వరరామచంద్రాపురం, అక్టోబరు 7: స్థానిక వీడియో బజారులో ఉత్సవ కనకదుర్గ అమ్మ వారు సోమవారం చండీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మండపంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కూనవరం తహశీల్దారుగా శ్రీనివాస్



కూనవరం, అక్టోబరు 7: కూనవరం తహసీల్దారుగా కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు జగ్గంపేట డిప్యూటీ తహసీల్దారుగా పనిచేశారు.

ప్రమాద బీమా పాలసీపై అవగాహన



దేవీపట్నం, అక్టోబరు 7: పద్దెనిమిది నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న వారంతా పోస్టాఫీసులో ప్రమాద బీమా పాలసీ నమోదు చేసుకోవాలని ఇందుకూరు బ్రాంచి పోస్టుమాస్టర్ పీఏ కొండలరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 8 మంది నమోదు చేసుకున్నారన్నారు. సంవత్సరానికి రూ.355 పాలసీ కడితే అనుకోని ప్రమాదం జరిగి చనిపోతే రూ.5లక్షలు, శాశ్వత వైకల్యం జరిగితే రూ.10లక్షలు నామిని ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ కొండదొరల సంఘం జిల్లా నాయకుడు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కారం రామన్నదొర, ముురదా బాపామణి, కానూరి రామకృష్ణ, టెంకి రాంబాబు, ములపర్తి ఈశ్వర్‌దొర తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్స్‌లతో తక్షణ వైద్యం



రికార్డులను తనిఖీ చేస్తున్న మేనేజరు శ్రీనివాస్

రాజవొమ్మంగి, అక్టోబరు 7: గిరిజన ప్రాంతాల్లో 108 వెళ్లలేని మారుమూల గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా ప్రజలకు తక్షణ వైద్యం అందిస్తామని ఫీడర్ అంబులెన్స్ జిల్లా మేనేజరు శ్రీనివాస్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని అమ్మిరేకుల, కింద్ర, దోనేలపాలెం, జడ్డంగి గ్రామాల్లో ఉన్న ఫీడర్ అంబులెన్స్‌లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

దేవీపట్నం, అక్టోబరు 7: అక్రమంగా సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ సోమవారం దాడి చేశారు. గండికోటలో నాటుసారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఏఎస్ఐ రాఘవ, పీసీ సత్తిబాబుదొర, జగన్ పాల్గొన్నారు.

బాణసంచా తయారీకి అనుమతులు తప్పనిసరి

అనపర్తి, అక్టోబరు 7: అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనునాయక్, తహశీల్దార్ అనిల్‌కు మార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాణసంచా తయారీదారులు, విక్రేతలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా బాణసంచా నిల్వ చేయకూడదన్నారు. దీపావళి మందు గుండు సామగ్రి విక్రయాలకు ప్రభుత్వం అనుమతి పొందిన ప్రాంతంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో కేంద్రం నిధులు పక్కదారి

» మంత్రి కందుల దుర్గేష్

» అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే గోరంట్ల



దామిరెడ్డిపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, అక్టోబరు 7: జల జీవన్ మిషన్ ద్వారా ప్రతీ గ్రామ, పట్టణానికి తాగు నీరందించేందుకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను గత ప్రభుత్వంలో పక్కదారి పట్టించారని మంత్రి కందుల దుర్గేష్ ఆరోపించారు. మండలంలోని దామిరెడ్డిపల్లిలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేయనున్న మల్టీపర్పస్ యాక్టివిటీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సర్పంచ్ ముద్రగడ సత్యస్వరూప, ఉపసర్పంచ్ ముద్రగడ జమీ అధ్యక్షతన సోమవారం జరిగింది. దీనికి మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారని, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, గత ప్రభుత్వం తప్పిదంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, దానిని గాడిలో పెట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. అనంతరం వారు కడియం దుర్గమ్మ ఆలయానికి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీను, మార్గాని సత్యనారాయణ, రత్నం అయ్యప్ప, చెక్కపల్లి మురళి, రంపం గోపాలకృష్ణ, వెలుగుబంటి నాని, ఆకుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకం

» శిక్షణా తరగతుల్లో ఎంపీడీవో ఝాన్సీ



రాజానగరం శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, అక్టోబరు 7: గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమైందని ఎంపీడీవో జేఏ ఝాన్సీ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రూపొందించిన రిఫ్రెషర్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాల్లో రెండు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. ప్రధానంగా గ్రామ/జిల్లా పరిషత్/మండల పరిషత్ విధులు, హక్కుల గురించి వివరించామన్నారు. అలాగే పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ నిధులు వినియోగం తదితర 9 అంశాలకు సంబంధించి ఉపసర్పంచ్, ఇద్దరి (ఒక మహిళ, ఒక పురుష)వార్డు సభ్యులకు శిక్షణ కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ అనంతరం ఆయా గ్రామాలకు అవసరమైన సదుపాయాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ శిక్షణా తరగతులకు రిసోర్స్‌పర్సన్లుగా మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎం.సుబ్రహ్మణ్యం, కొత్తతుంగపాడు పంచాతీ కార్యదర్శి హనుమంతరావు వ్యవహరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెదవెంకన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ బాలరాజు పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రత్నకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీరాజ్ చట్టం, పరిపాలనా విధానం, పారిశుధ్యం, లేఅవుట్లు, తాగునీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి విషయాలపై శిక్షణ ఇచ్చారు.

రంగంపేట: రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీవీ సాయిబాబు ఆధ్వర్యంలో యోగా తరగతితో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన ఈవోపీఆర్డీ పలు శిక్షణాంశాలను వివరించారు. పంచాయతీ పాలన, సమావేశాలు, గ్రామసభ నిర్వహణ, పంచాయతీల తనిఖీ, పర్యవేక్షణ, పారిశుధ్య సేవలు తదితర అంశాలపై తరగతులను నిర్వహించారు.

కనకదుర్గమ్మకు సహస్ర జల ఘటాభిషేకం

బిక్కవోలు, అక్టోబరు 7: కొంకుదురులోని రామానాయుడు వీధిలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కనకదుర్గమ్మకు సహస్ర జల ఘటాభిషేకం నిర్వహించారు. ముందుగా వెయ్యిమంది భక్తులు ఘటాలతో తుల్యభాగ జలాలతో గ్రామోత్సం జరిపారు. అనంతరం ఈ జలాలతో అమ్మవారిని అభిషేకించారు. ఈ సందర్భంగా చిన్నం శ్రీనివాసరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బాలభక్త సమాజ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించింది. ఇదిలా ఉండగా బిక్కవోలు జువ్వలదొడ్డిలోని శ్రీరాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు బాలా త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలుచేశారు.



అనపర్తిలో మహాచండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు



బిక్కవోలు: కొంకుదురులో ఘటాలతో జలాలు తీసుకెళ్తున్న భక్తులు

శ్రీ త్రిశక్తి పీఠంలో మహాచండీ హోమం

అనపర్తి, అక్టోబరు 7: దేవీ నవరాత్రుల్లో భాగంగా సోమవారం అనపర్తిలోని శ్రీత్రిశక్తి పీఠంలో మహాచండీ హోమం నిర్వహించారు. గురు భవానీ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు.ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు హోమకర్తలుగా వ్యవహరించారు. హోమంలో పీఠం వ్యవస్థాపకురాలు జడ్పీటీసీ కర్రి శేషారత్నం, కూటమి నాయకులు,మహాశక్తి మహిళల సహా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు, ఎల్లుండి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ట్రాన్స్‌కో ఈఈ(ఆపరేషన్) శ్రీధర్‌వర్మ

దివాన్‌చెరువు, అక్టోబరు 7: సంపత్‌నగరం సెక్షన్ పరిధిలో ట్రాన్స్ టవర్ కండక్టర్ మార్పు చేసే నిమిత్తం ఈ నెల 8, 10వ తేదీల్లో సంపత్‌నగరం, కొండగుంటూరు, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, కేటీ పాడు, పీటీ పాడు, జి.ఎర్రంపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ(ఆపరేషన్) దాట్ల శ్రీధర్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ, 10వ తేదీ ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

గోకవరం మండల పరిషత్ ఏవోగా శ్రీనివాస్

గోకవరం, అక్టోబరు 7: స్థానిక మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రాయవరం మండల పరిషత్ ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన ముత్యాల ప్రసాద్ రాజమహేంద్రవరం పంచాయతీరాజ్ కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు. కాగా నూతన ఏవో శ్రీనివాస్ గతంలో గోకవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు.

రాజానగరం సెర్ప్ ఏపీఎంగా సునీత

హేమనాగలక్ష్మి రాజమహేంద్రవరం రూరల్‌కు బదిలీ



రాజానగరం, అక్టోబరు 7: రాజానగరం సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) ఏపీఎంగా గుమ్మడి సునీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. గోకవరం ఏపీఎంగా పనిచేస్తున్న ఈమె సాధారణ బదిలీల్లో భాగంగా రాజానగరం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన కర్రి హేమనాగలక్ష్మి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు సునీతకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే రాజానగరం క్లస్టర్ కోఆర్డినేటర్లుగా పనిచేస్తున్న పద్మారావు(కడియం), కన్నబ్బాయి, రాజయ్యదొర(జగ్గంపేట), లోవకుమారి(కాకినాడ)కు బదిలీపై వెళ్లారు.

'సన్నిధానం'కు సోదరి వియోగం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7: రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖులు సన్నిధానంశర్మ శాస్త్రి సోదరులకు సోదరి వియోగం సంభవించింది. వారి సోదరి ఇనుగంటి లక్ష్మీనరసమ్మ(83) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భర్త ఇనుగంటి సుబ్బారావు కొన్నేళ్ల క్రితమే మరణించారు. వీరికి పిల్లలు లేరు. ఒకప్పటి లక్కవరం ఆస్థాన కవి కొత్తపల్లి సుందరరామయ్యకి లక్ష్మీనరసమ్మ మనుమరాలు. వావిలాల గోపాలకృష్ణయ్య, పాతూరి నాగభూషణం వంటి ఎందరో సమరయోధులకు, సాహితీవేత్తలకు, ప్రముఖులకు ఆమె తుమ్మలావలో తమ గృహంలో ఆతిథ్యమిచ్చారు. మండపేటలో ప్రైవేటు టీచర్‌గా అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. లక్ష్మీనరసమ్మ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తంచేశారు.

నేడు బిక్కవోలు మండల సర్వసభ్య సమావేశం

ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమార్

బిక్కవోలు, అక్టోబరు 7: బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమార్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు.

చిరువ్యాపారికి తోపుడు బండి అందజేత



చిరువ్యాపారికి తోపుడు బండి, వృద్ధులకు పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7: రాజమహేంద్రవరంలో పేదరికంలో ఉండి ఉపాధికి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తోపుడు బండిని అందజేశారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు తోడ్పాటునిస్తున్న ఎమ్మెల్యే వాసు సోమవారం స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయం వద్ద తోపుడు బండిని చిరువ్యాపారికి అందించారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉండి పింఛను కోల్పోయిన కొందరికి పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టం అన్నవారిని ఆదుకోవడంలో తమ ట్రస్ట్ ముందుంటుందన్నారు.

ఎన్టీఆర్, జీఎస్ఆర్ బ్లడ్ బ్యాంక్ పరిశీలన

స్థానిక ప్రకాష్‌నగర్‌లో ఇటీవల ఎన్టీఆర్ ట్రస్ట్, జీఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించిన బ్లడ్ బ్యాంక్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పరిశీలించారు. అత్యాధునిక పరికరాలతో అతి తక్కువ ధరలతో బ్లడ్ బ్యాంక్‌లో సేవలు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాం బాబు, మరుకుర్తి రవియాదవ్, కోకోనట్ వాసు, కంటిపూడి రాజేంద్రప్రసాద్, మళ్ల వెంకట్రాజు, మొకమాటి సత్యనారాయణ, బ్లడ్ బ్యాంక్ మేనేజరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మహిళా సమాఖ్య ఏపీఎంగా జిలానీ

సీతానగరం, అక్టోబరు 7: సీతానగరం మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా ఎండీ జిలానీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనపర్తి ఏపీఎంగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వర్తించిన మహాలక్ష్మి నిడదవోలు మండలం బదిలీ అయ్యారు. క్లస్టర్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన రామచక్ర కోరుకొండ బదిలీపై వెళ్లారు. కొవ్వూరు, గోవరవరం, రంగంపేట మండలాల్లో క్లస్టర్ కోఆర్డినేటర్లుగా పనిచేసిన హరిబాబు, వెంకటలక్ష్మి, దార లక్ష్మి బదిలీపై సీతానగరం వచ్చారు. ఏపీఎం జిలానీ, క్లస్టర్ కో ఆర్డినేటర్లకు మండల సమాఖ్య అధ్యక్షురాలు కురియాల కస్తూరి, కార్యదర్శి పోశమ్మ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

గుండెపోటుతో విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ మృతి



రాజానగరం, అక్టోబరు 7: రాజానగరం మండల వ్యవసాయాధికారిగా ఐదేళ్ల పాటు ఎనలేని సేవలందించి, పదోన్నతిలో భాగంగా ప్రస్తుతం విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పల్లా సురేష్ సోమవారం గుండెపోటుతో మృతిచెందారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ రాజానగరం మండల ఎరువులు, పురుగు మందులు,విత్తనాల డీలర్ల అసోసియేషన్ సభ్యులు సముద్రాల రాంబాబు, దుర్గపు వసంత కుమార్, మద్దుల గిరిబాబు, గోపి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలు అడ్డుకోవాలి

డీవైఎఫ్ఐ నాయకుడు అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలని చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా యువతను, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి సదస్సులు, సెమినార్లు నిర్వహించాలని డీవైఎఫ్ఐ నాయకులు అశోక్‌కుమార్, ప్రసన్నకృష్ణ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్తులో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈనెల 19న రాజమహేంద్రవరంలో జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 16 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) మీకోసంలో 16 అర్జీలను అధికారులు స్వీకరించారు. సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) ఎస్‌వీ రమణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తమ ప్రాంతంలో వెల్డింగ్ మోటార్ల పని ఎక్కువగా ఉంటోందని, దాంతో శబ్ధ, వాయు కాలుష్యం ఎక్కువ ఉంటుందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఇన్నీసుపేట కు చెందిన జ్యోతి అర్జీ పెట్టుకుంది. అలాగే బఫర్ జోన్ నుంచి తొలగించి తనకు ఇల్లు కట్టుకునే అనుమతి మునిసిపల్ కాలనీకిచెందిన లంక కృపానిధి ఇవ్వాలని అర్జీపెట్టుకుటుంది. కార్యక్రమంలో కార్పొరేషన్ సీపీ జి.కోటయ్య, ఎస్ఈ జీపాండురంగారావు తదతర అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో అవినీతిపై ఫిర్యాదు

సీతానగరం, అక్టోబరు 7: రఘుదేవపురం ఎస్సీ పేట పాఠశాలలో నాడు-నేడు పనుల్లో ప్రధానోపాధ్యాయులు అవినీతికి పాల్పడ్డారని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాపాక గ్రామానికి చెందిన పసలపూడి రామారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాసు సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రామారావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయిందని, పారిశుధ్య కార్యక్రమాలు జరగడం లేదని, రోడ్లు సరిగా లేవని రాపాకకు చెందిన ముత్యాల మహేష్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటలపై నైపుణ్యం పెంచుకోవాలి

ఎరువుల వినియోగంపై వ్యవసాయ సహాయకులకు అవగాహన

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 7: మండలంలోని హుకుంపేటలో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు ఎరువులు కలుపు మందులు వినియోగంపై అవగాహన కలిగించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడారు. పంటకు కావాల్సిన ముఖ్యపోషకాలను తెలియజేశారు. శాస్త్రవేత్త సీహెచ్ నరసింహరావు వరిలో సమగ్ర సస్యరక్షణ విత్తనం ఎంపిక చేసుకునే విధివిధానాలు, సామూహిక ఎలుకల నివారణపై మాట్లాడారు. మరో శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎరువులు, నీటి యాజమాన్యం కలుపు మందుల గురించి తెలిపారు. ఏడీ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో ప్రకృతి, సేంద్రియ సాగు పద్ధతులు ఆచరించడం వల్ల పంటకు తెగుళ్లు, పురుగులను తట్టుకొనే శక్తి వస్తుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ రామలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పంటలపై నైపుణ్యం పెంచుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ పంచాగం పుస్తకాలను ఉద్యానవన సహాయకులకు అందించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీ.. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్య

ధవళేశ్వరం, అక్టోబరు 7: ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ సోమవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, కేసుల నమోదు వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.

వడ్డెర కాలనీలో అవగాహన.. స్థానిక శ్రీరామ వడ్డెర కాలనీలో నివాసితులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ టి.గణేష్ మాట్లాడుతూ కాలనీలో కొత్త వ్యక్తులను, అనుమానితుల కదలికలు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఇంట్లో బంగారం, నగదు ఉంచి ఇంట్లో తాళం వేసి ఊరెళ్లే వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా లాక్‌హౌస్ మోనటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్ఎంఎస్) ద్వారా దొంగతనాలు అరికట్టవచ్చని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీ అండతోనే విశిష్ట సేవలు

పౌరసన్మానంలో తనకాల నాగేశ్వరరావు



విశిష్ట సేవల పురస్కారం అందుకున్న నాగేశ్వరరావు

కోరుకొండ, అక్టోబరు 7: టీడీపీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు కొనసాగుతూ ఆ పార్టీ ఎమ్మెల్యే సహకారంతోనే ప్రజలకు విశిష్ట సేవలందించినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు అన్నారు. గోదావరి టాలెంట్ టెస్ట్ ఆధ్వర్యంలో అపర భగీరథ విశిష్ట సేవా పురస్కారం అందుకున్న నాగేశ్వరరావుకు గ్రామస్థులు పౌర సత్కారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో తనకాల మాట్లాడారు. 54ఏళ్ల తన రాజకీయ జీవితంలో 39 పదవులు చేపట్టానని, వాటి ద్వారా ప్రజలకు చేసిన సేవలను గుర్తించి గోదావరి టాలెంట్ టెస్ట్ వారు తనకు పురస్కారం అందజేసినట్టు చెప్పారు. సమావేశంలో టీడీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి అడపా వీరబాబు, మళ్ల అప్పలనర్సారావు, పెనకటి శివాజీ, దాడి శ్రీను పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని కేసు నమోదు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తనను కులం పేరుతో దూషించారని ప్రకాశంనగర్‌కు చెందిన వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ బాజీలాల్ తెలిపారు. గతంలో ఓ భవనానికి సంబంధించి అద్దె బాకీ ఉన్నావంటూ ఓ వ్యక్తి తరపున వచ్చిన శ్రీనివాస యాదవ్ కులం పేరుతో తనను దూషించారని సి.శాంతారామ్ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.





భూ చోళ్లు!

నగరంలో రెచ్చిపోతున్న భూమాఫియా

- కోట్ల విలువైన భూములపై కన్ను
- సీటీఆర్‌ఐలో 56 ఏళ్ల కిందట ప్లాట్లు
- 32.09 ఎకరాల్లో 268 విభజన
- పబ్లిక్ సర్వెంట్స్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు
- ప్రస్తుతం 29 స్థలాలు అన్యాక్రాంతం
- ఒక్కో ప్లాట్‌పై నాలుగు రిజిస్ట్రేషన్లు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- రూ.2 కోట్ల విలువ.. రూ.కోటికే రిజిస్ట్రేషన్
- కోర్టులో కేసు ఉన్నా సాగిన వ్యవహారం
- లిక్విడేటర్ రక్షించలేని పరిస్థితి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే యోచన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

భూమాఫియా బరితెగించింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తోంది. ప్రభుత్వ స్థలమైనా..ప్రైవేటు స్థలమైనా ఆక్రమిస్తోంది. సామాన్య మధ్యతరగతి ప్రజలు రూపాయి.. రూపాయి కూడబెట్టుకుని కొనుగోలు చేసిన స్థలాలు రక్షించుకోవడం కష్టమైపోతోంది. ప్రస్తుతం ఆ భూమాఫియా గుప్పెట్లో సీటీఆర్‌ఐ ప్రాంతం భాస్కరనగర్‌లోని 19975 నాటి రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలాలు ఉన్నాయి. ఆయా స్థలాలు ఆక్రమించి మూడు నాలుగు రిజిస్ట్రేషన్లు చేసిన దాఖలాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఇంత జరుగుతున్నా ఏ ఒక్కరూ నోరుమెదపకపోవడం శోచనీయం.

1968లో ప్లాట్ల విభజన..

రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్ కో ఆపరేటివ్ సొసైటీ 1968లో మార్కెట్ విలువ (సబ్ రిజిష్టర్ వేల్యూ) ప్రకారం 32.09 ఎకరాలు కొను గోలు చేసింది.ఆ భూములు 111, 114,117, 118,119, 120, 121/1, 122/1,135 సర్వే నెం బర్లలో ఉన్నాయి.ప్రభుత్వం 1975లో ఈ భూమిని 254 ప్లాట్లుగా కేటాయించింది. అవిగాక క్రాస్ బిట్లు 14 ఉన్నాయి.ఈ స్థలాలు పొందడానికి లబ్ధిదారుడు ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండాలి. కనీసం 21 ఏళ్ల వయస్సు ఉండాలి. అప్పట్లో ఏం జరిగిందో కానీ చాలా మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కొందరు చేయించుకోలేదు.కొందరికి 2 నుంచి 3 ప్లాట్లు కేటాయించారు. కానీ అధికారికంగా రిజిస్ట్రేషన్ మాత్రం ఒక ప్లాటికే జరిగింది. ఈ విషయం తెలియడంతో భూమాఫియా కన్ను ఆ స్థలాలపై పడింది.ఆక్రమించుకోవడం, వేరేవారికి అమ్మేయడం ఇలా ఇప్పటి వరకూ చాలా ప్లాట్లు మూడు నాలుగు చేతులు మారాయి.ఇది పెద్ద వివాదం కావడంతో గతంలో విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. సొసైటీ సభ్యులు ఎవరూ లేకపోవడంతో సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థాయి అధికారిని ప్రభుత్వం ఇక్కడ లిక్విడేటర్‌గా నియమించి వీటిని రక్షించే బాధ్యత అప్పగించింది. కానీ పరిస్థితిలో మార్పు లేదు.అన్యాక్రాంతం జరుగుతూనే ఉంది.

29 ప్లాట్లు అన్యాక్రాంతం

254 ప్లాట్లలో 160 జన్యూన్‌గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. 15 ప్లాట్లు అన్యా క్రాంతమైనట్టు అధికారులు గుర్తించారు. క్రాస్ బిట్లుగా ఉన్న 14 అంటే మొత్తం 29 బిట్లు ఆక్రమణకు గురయ్యాయి.78 ప్లాట్లను వెరిఫికేషన్ చేయ వలసి ఉంది. ఏ శక్తులు పనిచేస్తున్నాయో కానీ వెరిఫికేషన్ జాప్యం అవుతోంది. వీటికి సంబంధించిన రికార్డులను ఎవరో మాయం చేశారు. సబ్- రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఒక్కొక్కటి బయటకు తీస్తున్నారు.తర్వాత ఎవరో లిటిగేషన్ పెడుతున్నారు.దీంతో ఇక్కడ నిత్యం ఏదో వివా దం జరుగుతూనే ఉంది. ప్రస్తుతం కోర్టులో ఆరు ప్లాట్లు ఒకరికే రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతంపై కేసు నడుస్తోంది. కానీ సర్వే నంబర్ 121/1లోని 249 నంబరు ప్లాట్, 250 ప్లాట్‌కు సంబంధించి తాజాగా మరో వివాదం చెలరేగింది.వై.జయలక్ష్మి తనకు 1970లోనే రెండు ప్లాట్లు అలాట్ అయ్యాయని..వాటికి లిక్విడేటర్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని 2017లో జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కోర్టు ఆమెకు ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవలసిందిగా ఆదేశించింది.కానీ అధికారులు ఆమె రికార్డులు పరిశీలించగా ఆమెకు అర్హత లేదని,ఆమె ప్రభుత్వ ఉద్యోగి కాదని.. పైగా ఆమెకు కేటాయించినట్టు చెబుతున్న నాటికి 18 ఏళ్ల వయసులోపే మైనర్‌గా ఉందని రివ్యూపిటిషన్‌ను కోర్టులో వేశారు. ఈలోపు గత నెలలో 249వ ప్లాట్‌ను కె.కె.వెంకటరెడ్డి, 250వ ప్లాట్‌ను కె.బాపిరెడ్డి అనే వ్యక్తులకు రాజమ హేంద్రవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజి స్ట్రేషన్ చేసినట్టు లిక్విడేటర్ చంద్రశేఖర్ తెలి పారు. జయలక్ష్మి ఆ రోజు మజ్జి వీరభద్రరావు అనే వ్యక్తిపేర స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ రాసి గత నెల 20న రాజమహే ంద్రవరం సబ్- రిజి స్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి నట్టు చెబుతున్నారు. ఇటీవల బదిలీ అయిన సబ్- రిజిస్ట్రార్ రిలీవ్ అయ్యే సమయంలో ఈ పని పూర్తిచేసినట్టు ప్రచారం జరుగుతోంది.ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున సొమ్ములు చేతులుమారినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

స్థలాలన్నీ లిటిగేషన్..

ప్రస్తుతం ఆ ప్రాంతంలో గజం మార్కెట్ విలువ రూ.30 వేల వరకూ ఉంది. మొత్తం ఒక్కో ప్లాట్ 346 గజాల్లో ఉంది.దానిని కేవలం రూ.47.52 లక్షలకు అమ్మేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. వాస్తవానానికి ఒక్కో స్థలం విలువ రూ.కోటి పైనే. రెండు ప్లాట్లు రూ.2కోట్లపైనే. కానీ ఇక్కడ ఎవరి మధ్య డబ్బు చేతులు మారిం దో కానీ తక్కువ ధరకే రిజిస్ట్రేషన్ అయి పోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న ట్టు లిక్విడేటర్ ఈ సంగతిని ఇటీవల తమ ఉన్నతాధికారులకు తెలియజేశారు. క్రిమినల్ కేసు పెట్టే యోచనలో ఉన్నారు. ఇక్కడ అనేక ప్లాట్లు వివాదాల్లో ఉన్నాయి. ఉన్నతాధికారులు కూడా కొనుక్కుని ఇరుక్కుపోయారు. అన్యాక్రాంతమైన స్థలాలన్నీ భూమాఫియా ఇప్పటికే అనేక చేతులు మార్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇక్కడ దందా జరిగింది. ఈ వ్యవహారం అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు ఉన్నట్టు సమాచారం. ఇక్కడ మొత్తం ఆక్రమణలకు గురైన స్థలాలు కొన్ని కోట్ల విలువ చేస్తాయి. ప్రభుత్వం దృష్టిపెట్టి వీటిని స్వాధీనం చేసుకుంటేనే ఇక్కడ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. వాస్తవంగా అర్హత ఉన్నవారికి దక్కేలా చేసి రికార్డులులేని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.

జై దుర్గ



కరుణించమ్మా.. దుర్గమ్మా : కోరుకొండ రోడ్‌లో కలశాలతో 300 మంది మహిళల ఊరేగింపు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7 : జై దుర్గ.. జైజై దుర్గ అంటూ భక్తులు ఊగిపోయారు.. దుర్గమ్మను కొలుస్తూ ముందుకు సాగారు. రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్ ప్రాంతం సోమవారం కనకదుర్గమ్మ నామస్మరణతో మారుమ్రోగింది. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోరుకొండ రోడ్డులోని సాయి కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. జొన్నాడ వీరవెంకట సుబ్బారావు శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో 300 మంది మహిళలు కలశాలతో ఊరేగింపు చేశారు. ఊరేగింపు ముందు గిరిజన సాంప్రదాయ నృత్యం కొమ్ముడ్యాన్సుల ప్రదర్శన జరిగాయి. హిందూ సనాతన ధర్మ పరిరక్షణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన దీక్షకు మద్దతుగా ఆలయ కమిటి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను హాజరయ్యారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంటిపూడి శ్రీనివాస్ పద్మా వతి, దుద్దిపూడి శ్రీనివాస్, పద్మావతి ,జొన్నాడ వీరవెంకట సుబ్బారావు, శ్రీదేవి ,మాజీ కార్పొరేటర్లు పాలవలస వీరభద్రం, జవ్వాది మురళీకృష్ణ, దుర్గ, పినిశెట్టి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌లు కొవ్వూరు డిపోకు రావాలి

ఆర్టీసీ ఆర్‌ఎంకు సూచించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 7 : కొవ్వూరు డిపో నుంచి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కొవ్వూరు పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ ఆర్‌ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్‌లు రోడ్డు కం రైలు బ్రిడ్జి నుంచి కొవ్వూరు మీదుగా ఏలూరు, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయాలని ఎవరు మీకు ఆర్డర్ ఇచ్చారని ప్రశ్నించారు. బస్సులన్నీ గామన్‌బ్రిడ్జి పైనుంచి కొవ్వూరు డిపోకు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొవ్వూరు పట్టణంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక..ఆర్టీసీ బస్సులు రాకపోతే ప్రజలు ఎలా ప్రయాణం చేస్తారని ప్రశ్నించారు. పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని కొవ్వూరు డిపోకు కొత్త బస్సులను కేటాయించాలన్నారు.దీనిపై స్పందించిన ఆర్‌ఎం కొవ్వూరు డిపో నుంచి విజయవాడ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే టీవీ. రామారావు, బోడపాటి ముత్యాలరావు, పెనుమాక జయరాజు ఉన్నారు.

విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడవద్దు

ఉపాధ్యాయులకు డీఈవో వాసుదేవరావు సూచన



దివాన్‌చెరువు, అక్టోబరు 7 : ఉపాధ్యాయులు విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడవద్దని డీఈవో వాసుదేవరావు సూచించారు. దివాన్‌చెరువులోని ఒక ప్రైవేటు కార్యక్ర మంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థినులకు ఉపాధ్యాయులకు మధ్య 5-6 అడుగులు దూరం పాటించి విద్యాబోధన చేయాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. వార్షిక విద్యాకాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తిచేసే విధంగా చర్యలు చేట్టామన్నారు. అన్నితరగతుల్లోనూ విద్యార్థులు అభ్యాసనాసామర్థ్యాలు వారి స్థాయికి తగిన విధంగా ఉండేలా ప్రాథమికస్థాయి నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా అన్ని పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులును కేటాయించామని తెలిపారు.

డీఎస్‌వోగా ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం రూరల్ అక్టోబరు 7: జిల్లా సివిల్ సప్లయిస్ అధి కారిగా ప్రసాదరావు నియమితులయ్యారు.ఈయన గతంలో రాజమహేంద్రవరంలో పనిచేశారు.అటుపై ఉమ్మడి తూర్పుగోదావరి, కృష్ణా,గుంటూరు జిల్లాల్లో పనిచేశారు.కర్నూలు డీఎస్‌వోగా పనిచేస్తూ బదిలీపై తూర్పుగోదావరికి వచ్చారు.ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడును కలిశారు.

టెట్‌కు 50 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగిందని డీఈవో వాసుదేవరావు తెలిపారు. ఉదయం సెషన్‌లో 240 మంది అభ్యర్థులకు 220 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 240 మందికి 210 మంది హాజరయ్యారన్నారు.

15 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పొడిగించారని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. మెరిట్ పరీక్ష డిసెంబరు 8న జరుగుతుందన్నారు. ఎస్‌బీఐ కలెక్ట్ ద్వారా చెల్లించిన రుసుము రసీదు ఒరిజినల్‌ని ఈ నెల 17వ తేదీలోపుగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు www.bse.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయన్నారు.

రేపు మంత్రి నాదెండ్ల మనోహర్ రాక

కొవ్వూరు, అక్టోబరు 7 : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో పర్యటిస్తారని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.రాధిక తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాయంత్రం 4 గంటలకు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, జేసీ ఎస్.చిన్నరాముడు తదితరులు పాల్గొంటారన్నారు.

టైర్ పంక్చర్..గొర్రెలు మృతి 8



ఎకరా ఆదాయం రూ.2 లక్షలు

ఖోఖో సాగు..బాగు బాగు

- లాభాలు కురిపిస్తున్న పంట
- భారీగా పెరిగిన ధర
- కిలో గింజలు రూ.1050
- 14 వేల హెక్టార్లలో పంట
- మారిన రైతుల చూపు
- అంతరపంటగా సాగు
- ప్రభుత్వ సబ్సిడీ రూ.20 వేలు

పెరవలి/చాగల్లు, అక్టోబరు 7 : ఖోఖో సాగుపై జిల్లా లో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ శాతం కొబ్బరిలో అంతరపంటగా వేస్తున్నారు. మిగిలిన పంటలతో పోలిస్తే ఖోఖో పంట సిరులు కురిపిస్తుండడమే కారణం. ఈ ఏడాది జనవరి నుంచి ఖోఖో గింజల రేటు అత్యధికంగా పెరగడంతో రైతులకు లాభాల పంట పండింది. గతంలో అన్‌సీజన్‌లో రూ.150 ఉండే గింజల ధర సీజన్‌లో రూ.200 నుంచి రూ.240 వరకు పలికేది. ఈ ఏడాది అయితే ఒక్కసారిగా వంద నుంచి రూ.200 చొప్పున పెరుగుతూ కేజీ గింజలు ధర రూ.1050 వరకు చేరింది. ప్రస్తుతం వర్షాకాలంలో గింజల నాణ్యత పెద్దగా లేకున్నా కేజీ గింజల ధర రూ.350 వరకు ఉందని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం

గత నాలుగేళ్లుగా కొబ్బరి దిగుబడి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.గతంలో ఖోఖో తోటలు రైతులు అంతంత మాత్రంగానే వేశారు. ప్రస్తుతం రేటు బాగుం డడంతో ఎక్కువ శాతం ఖోఖో మొక్కలు వేయడానికి సిద్ధమవుతున్నారు. సాధారణంగా కొబ్బరిలో అరటి, కూరగాయలు, పూల తోటలు అంతర పంటలుగా వేస్తారు. గత పది నుంచి 15 ఏళ్లు ఖోఖో సాగు చేస్తున్నప్పటికి గింజల ధర అంతంత మాత్రంగా ఉండడంతో పెద్దగా రైతులు మొగ్గు చూపలేదు.ఖోఖో మొక్కలు నాటిన 2 నుంచి మూడేళ్ల తరువాత మాత్రమే కాపు మొదలవుతుంది. ఎకరానికి ఎంత లేదన్నా 4 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్ల వరకు వస్తుందని రైతులు చెబుతున్నారు.సరాసరి రేటు కేజీ రూ.500 చూసుకున్నా క్వింటాకు రూ.50 వేలు పైగానే వస్తుంది.ఈ లెక్కన ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. కోత ఖర్చులు, ఎరువులు మిగిలిన ఖర్చులు రూ.50 వేలు తీసివేసినా ఎకరానికి రూ.2 లక్షలు పైగానే ఆదాయం వస్తున్నట్టు రైతులు చెబుతున్నా రు. ఖోఖో సాగు ఎక్కువగా ఆఫ్రికా దేశాల్లో ఉం టుంది. కొత్తగా కౌలుకు తీసుకునే వారికి కొబ్బరిలో ఖోఖో ఉన్న తోట ఎకరా రూ.లక్ష నుంచి రూ. లక్ష 25 వేలుపలుకుతోంది.గతేడాది ఇవే తోటలు ఎకరా రూ.60 వేలు నుంచి రూ.80 వేలు ఉండేది. కొబ్బరి విడిగా ఎకరాకు రూ.50 వేలు,ఖోఖోకు రూ.50 వేల నుంచి రూ. 80 వేల వరకు పలుకుతుంది. తోటల దిగుబడి ఆధారంగా రేటు ఉంటుంది.

14 వేల హెక్టార్లలో సాగు..

జిల్లావ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో ఖోఖో సాగు చేస్తున్నారు.కొవ్వూరు ఉద్యానవన శాఖ పరిధిలోని చాగల్లు మం డలంలో కొబ్బరి 6,200 ఎకరాల్లో ఉండగా అంతరపంటగా ఖోఖో 5,170 ఎకరాల్లో ఉంది. కొవ్వూరు మండలంలో 430 ఎకరాలకు 298 ఎకరాల్లో ఖోఖో ఉంది. పెరవలి మండలంలో 700 ఎకరాలకు 185 ఎకరాల్లో, తాళ్ళపూడి మండలంలో 245 ఎకరాల కొబ్బరిలో ఖోఖో 196 ఎకరాల్లో, ఉండ్రాజవరం మండలంలో 620 ఎకరాలు కొబ్బ రిలో 59 ఎకరాల్లోను ఖోఖో ఉంది. జిల్లా వ్యాప్తం గా మెట్టప్రాంత మండలాల్లో ఎక్కువగా కొబ్బరిలో ఖోఖోను అంతరపంటగా సాగుచేస్తున్నారు. కొబ్బరి తో పాటు పామాయిల్ తోటల్లో కూడా ఖోఖో మొక్కలు పెంచవచ్చునని కొబ్బరితో పోల్చితే దిగుబడి తగ్గుతుం దని చెబుతున్నారు. క్యాడ్‌బరి కంపెనీతో పాటు చాక్లెట్స్ తయారు చేసే కంపెనీలు కొనుగోలు చేస్తుంటాయి. బోర్నవిటా, బూస్ట్, కేక్‌ల తయారీలో ఈ ఫౌడర్ విని యోగి స్తుంటారు.దీని వల్ల భవిష్యత్తులో కూడా ఖోఖో ధరకు ఏ మాత్రం ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.20 వేల సబ్సిడీ..

ఖోఖో సాగు చేసే రైతులకు ప్రభుత్వం మూడేళ్ల పాటు సబ్సిడీ మొత్తం అందజేస్తుంది. మొదటి సంవత్సం రూ.12 వేలు, రెండో సంవత్సం, మూడో సంవత్సం రూ. 4 వేలు వంతున మొక్కలు కొనుగోలు, ఇతర మందులు, ఎరువులకు అందజేస్తారు.ఖోఖో ఆశాజనకంగా ఉండ డంతో వరి, చెరకు పండే నల్లరేగడి నేలల్లో సైతం రైతులు సాగుచేయడానికి ఆసక్తిని చూపుతున్నారు.

300 హెక్టార్లలో కొత్తగా సాగు



ఈ ఏడాది 300 హెక్టార్లలో కొత్తగా ఖోఖో మొక్కలు నాటారు. ఒక హెక్టార్‌కి రూ.20 వేలు ప్రభుత్వ సబ్సిడీ వస్తుంది. ఒక్కొక్క మొక్క ఖరీదు రూ. 12లుగా ఉంది. రైతులు ముందుగా సొమ్ము చెల్లించి మొక్కలు కొనుగోలు చేసుకుని తీసుకెళ్లాలి. అనంతరం రైతుల ఖాతాల్లో సొమ్ములు పడతాయి.

- శ్రీనివాస్, కొవ్వూరు డివిజన్ ఉద్యాన అధికారి



సమస్యలతో క్యూకట్టారు!

- కిటకిటలాడిన కలెక్టరేట్
- మౌలిక వసతులకు అర్జీలు
- 141 వినతుల స్వీకరణ
- పరిష్కరించాలని ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 7: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక మీ కోసం కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు.దీంతో కలెక్టరేట్ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రజలు ఇళ్ళు ,పించన్లు, మౌలిక సదుపాయాల కల్పనకు అర్జీలు పెట్టుకున్నారు. సోమవారం ఉద యం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ పి.ప్రశాంతి,జేసీ చిన్నరాముడు, డీఆర్ వో జి.నరసింహులుతో కలిసి అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా ఇళ్ళు, పించన్లు, రేషన్‌కార్డులు, అంత్యోదయ కార్డులు,శానిటేషన్, విద్యు త్ సరఫరా సమస్యలు, భూ ఆక్రమణలు, తాగునీరు, మురుగు నీటి పారుదల సమస్యలు, టిడ్కో ఇళ్ళు తదితర సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ సూచనలు చేశారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ విభాగానికి 58 ,పంచాయతీరాజ్‌కు 25, హోమ్‌శాఖకు 16, పౌరసరఫరాల శాఖకు 8, ఆర్ డబ్ల్యూ ఎస్ కు 7,ఇతర శాఖలకు 27 అర్జీలు వచ్చాయి. మొత్తంగా 141 అర్జీలు స్వీకరించారు.

8 ఏళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం

కాతేరుకు చెందిన బిమాల నాగమణి 2016లో చంద్రబాబు చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పథకంలో లబ్ధిదారుగా ఉంది. ఆ ఇంటి నిమిత్తం అప్పట్లో అప్పుచేసి రూ.1లక్ష చెల్లించింది. అటుపై అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. ఆ రూ.లక్షకు ఇప్పటికి వడ్డీ కడుతున్నా. డబుల్ బెడ్ రూమ్ ఇంటికి సంబంధించి బ్యాంక్ వాళ్ళు మార్ట్‌గేజ్ అవ్వలేదని రూ.3 లక్షలు చెల్లించాలని చెబుతున్నారు. ఇప్పటికే అప్పులపాలై ఉన్న తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కలెక్టర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చేది ఇందుకేనా సార్!



కలెక్టర్ పనిలో కలెక్టర్ ఉంటే.. అధికారుల పనిలో అధికారులు ఉన్నారు.. ప్రజలు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు అర్జీలు ఇస్తుండడంతో మిగిలిన అధికారులు మాకేంటి పని అంటూ సెల్‌లో కాలక్షేపం చేస్తూ కెమెరాకు చిక్కారు. కలెక్టరమ్మా.. ఈ అధికారులు పీజీఆర్ఎస్‌కు వచ్చేది ఇందుకేనా!

ఎస్పీ 'మీ కోసం'కు 34 అర్జీలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం(మీ కోసం) కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఎస్పీ నరసింహ కిషోర్ అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమక్షంలోనే సంబంధింత పోలీస్ స్టేషన్ బాధ్యులకు ఫోన్ చేసి తగు ఆదేశాలు ఇచ్చారు. చట్టానికి లోబడి న్యాయం చేయాలని సూచించారు. మొత్తం 34 అర్జీలను ఎస్పీ స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) సుబ్బరాజు, ఎస్‌ఐ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహకిశోర్

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితం

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొత్త బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, అక్టోబరు 7: ఆర్టీసీ ప్రయాణం చాలా సురక్షితమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్‌లో రాజమహేంద్రవరం నుంచి జంగారెడ్డిగూడెం నూతన బస్సును ఎమ్మెల్యే పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు హామీ ఇచ్చామని, త్వరలో దీన్ని ప్రారంభిస్తామన్నారు. తాళ్ళపూడి, చాగల్లు మండలాల్లోని కొన్ని గ్రామాలకు బస్సు నడపాలని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై మంత్రిని కొత్త బస్సులు కావాలని కోరగా అయిదు బస్సులు ఇస్తానన్నారు. ప్రజల డిమాండ్‌ను బట్టి అన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసును నడుపుతామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని తదితరులతో పాటు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్, కాగిత రఘు, మద్దుల సత్యనారాయణ, ఆర్టీసీ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

14 వరకు డిగ్రీలో చేరేందుకు అవకాశం

కొవ్వూరు, అక్టోబరు 7: కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో మేనేజ్‌మెంటు కోటాలో చేరడానికి ఈ నెల 7వ తేదీ నుంచి 14 వరకు అవకాశం కల్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు తెలిపారు. మేనేజ్‌మెంటు కోటాలో బీఎస్సీ, బీకామ్ గ్రూపులలో చేరేందుకు ఇంటర్మీడియట్, తత్సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9866408009, 9440243509లో సంప్రదించాలన్నారు.

భవానీదీక్షదారులకు ఉచిత భోజనం

నల్లజర్ల, అక్టోబరు 7: విజయవాడకు వెళ్లే భవానీదీక్షదారులకు నల్లజర్ల గ్రామభక్త బృందం పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ 600 మంది భక్తులకు భోజనాలు పెడుతున్నట్లు భక్త బృందం పేర్కొంది. రానున్న నాలుగు రోజులు ఉచిత భోజనంతో పాటు, విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వారు తెలిపారు. ఇక్కడి సౌకర్యాలను భవానీ భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆళ్ళ రమేష్, వెదుళ్ళ రామకృష్ణ, పాతూరి పాపారావు, సవలం రామకృష్ణ, కొత్తపల్లి నాగేశ్వరరావు, వల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వాడపల్లి గ్రామంలో దుర్గాదేవి ఊరేగింపు



కోటసత్తెమ్మ అమ్మవారు



దేవరపల్లిలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

కిటకిటలాడిన దేవీ ఆలయాలు

కొవ్వూరు, అక్టోబరు 7: దేవీ నవరాత్రుల్లో భాగంగా సోమవారం అయిదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలో దుర్గాదేవి ఊరేగింపు జరిగింది. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, శక్తివేషాలతో గ్రామంలో ఊరేగించారు. గోష్పాద క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి, సంస్కృత పాఠశాలలో లలితాపార్వతి, మెరకవీధి, ఆర్టీసీ డిపో, మున్సిపల్ కార్యాలయం వద్ద జ్ఞాన సరస్వతి ఆలయాల్లో దుర్గాదేవికి పూజలు చేశారు.

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం ఐదోరోజు దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి 280 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. భక్తులకు కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొత్త తులసి రామకృష్ణ దంపతులు చక్కెర పొంగలి వితరణ చేశారు.

దేవరపల్లి: మూడు బొమ్మల సెంటర్ వద్ద సౌభాగ్య దుర్గాంబిక, పల్లపువీధి రామాలయం వద్ద విజయదుర్గ, బాలదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవార్లను చండీ అమ్మవారిగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. మూడు బొమ్మల సెంటర్ దుర్గాంబిక అమ్మవారి ఆలయం వద్ద చండీ హోమాన్ని వేద పండితులు పెదసనగంటి సాయి బాబా, శశికాంత్ శర్మ నిర్వహించారు. అధిక సంఖ్య లో మహిళలు పూజలు చేశారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామ దేవత మావూళ్లమ్మకు 250 గ్రాముల రజిత కాసులపేరును అందించారు. ప్రక్కిలంక గ్రామ దేవత అయిన మావూళ్లమ్మకు సీతానగరం వాస్త వ్యుడు ఆళ్ల శ్రీనివాసులు, గాయిత్రీదేవి దంపతులు వారి కుటుంబ సభ్యులతో అమ్మవారికి గ్రామస్తుల సమక్షంలో దాన్ని అలంకరించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యారు.



ప్రమాదస్థలంలో మృతిచెందిన గొర్రెలు

బొలెరో టైరు పంక్చర్.. 27 గొర్రెలు మృతి

ఇద్దరికి తీవ్రగాయాలు.. ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

దేవరపల్లి, అక్టోబరు 7 : దేవరపల్లి సమీపంలో డైమండ్ జంక్షన్ వద్ద సోమవారం రాత్రి బొలేరో వ్యాన్ టైరు పంక్చర్ కావడంతో బోల్తాపడి 27 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గుంటూరు నుంచి వైజాగ్‌కు గొర్రెల లోడుతో వెడుతున్న బొలెరో వ్యాన్ దేవరపల్లి డైమండ్ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి టైరు పేలడంతో వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. వ్యాన్‌లో మొత్తం 60 గొర్రెలు ఉండగా 27 మృత్యువాతపడ్డాయి. వ్యాన్‌లో వైజాగ్‌కు చెందిన ఐదుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన షేక్ పీర్, షేక్ సుభాన్‌లను రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు దేవరపల్లి ఎస్‌ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. వ్యాన్ బోల్తాపడిన సమాచారం తెలియగానే పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అప్రమత్తమై వెంటనే చర్యలు చేపట్టారు.

నిడదవోలు విద్యార్థికి ఇస్రో బహుమతులు



జాయింట్ కలెక్టర్ నుంచి స్పేస్ సైన్స్‌లో బహుమతులు అందుకొంటున్న తపస్విరెడ్డి

నిడదవోలు, అక్టోబరు 7: పట్టణానికి చెందిన విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి ఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని సోమ వారం భీమవరం విష్ణు విద్యా సంస్థలలో నిర్వహించిన స్పేస్ సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్‌లో ద్వితీయ బహుమతిని, స్పేస్ క్విజ్‌లో తృతీయ బహుమతిని సాధించాడు. పశ్చిమ గోదావరి జిల్లా జాయింటు కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్‌డీఎస్‌సీ షార్, ఎం.ప్రసాద్ నుంచి బహుమతులు అందుకున్నాడు.

'ఫొటోగ్రాఫర్లు టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి'

కొవ్వూరు, అక్టోబరు 7: కాలానుగుణంగా ఫొటోగ్రాఫర్లు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారడాని రాము అన్నారు. తూర్పు గోదావరి జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కొవ్వూరులో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా గెల్లా రాజబాబు, గౌరవాధ్యక్షులుగా పోకల రవి, ఉపాధ్యక్షులుగా మహేష్, ఆశీర్వాదం, సుధాకర్, జనరల్ సెక్రటరి షేక్ సిరాజ్, జాయింట్ సెక్రటరీలుగా నాగు, కార్తీక్, కోశాధికారిగా సిర్రా సూర్య, సహాయ కార్యదర్శిగా స్వరాజ్, పీఆర్వోగా ఏనుగుల బాలు, సలహాదారులుగా గేలం వెంకటేశ్వరరావు, నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా గోవా ప్రసాద్, వేణుగోపాలరెడ్డి, నాగసాయి, డి.శ్రీనివాస్‌లచే ఏలూరు జిల్లా జనరల్ సెక్రటరి చిన్నా ప్రమాణ స్వీకారం చేయించారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు షాబీర్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

శ్యామలాదేవికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి అవార్డు

దేవరపల్లి, అక్టోబరు 7: దేవరపల్లి మండలం కృష్ణంపాలెం అంబేడ్కర్ వయోవృద్ధుల ఆశ్రమ నిర్వాహకురాలు శ్యామలాదేవికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి అవార్డుకు ఎంపికయ్యారు. డొక్కా సీతమ్మ 183వ జయంతిని పురస్కరించుకుని కాకినాడలోని సత్కళావాహిని కళావేదిక వద్ద సోమవారం ఎమ్మెల్యే వంతం నానాజీ, పట్టణ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డొక్కా సీతమ్మ వారసుడు డొక్కా వీరవెంకట సత్యనారాయణ కామేశ్వరరావు అవార్డు అందజేశారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కృషి చేయాలి

దేవరపల్లి, అక్టోబరు 7: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వర్ణాంధ్ర 2047 పై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అభివృద్ధి చేయాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. విద్యుత్ సమస్యతోపాటు, డ్రైనేజీ నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డీవో డీ.సీలిమ, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి,ఈవోపీఆర్‌డీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో స్వర్ణాంధ్ర 2047 విజ్ఞానయాత్ర సందడి

గోపాలపురం, అక్టోబరు 7: వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ దర్శని స్వర్ణాంధ్ర 2047 విజ్ఞాన విహారయాత్ర ఆదివారం మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చేరింది. ఏడు రోజుల పాటు కొనసాగే ఈ విహారయాత్ర కడప నుంచి అరకు వరకు శ్రీహరికోట, ప్రకాశం బ్యారేజ్, రుషికొండ బీచ్, పోలవరం డ్యాం, అరకు, యానాం స్థలాలను సందర్శిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివే ప్రతిభావంతులు, 500 మంది విద్యార్థులను ప్రతిభాపరీక్ష ద్వారా ఎంపిక చేసి ఆంధ్రప్రదేశ్ దర్శని కార్యక్రమానికి తీసుకువచ్చామన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ స్వాధీనం

కొవ్వూరు, అక్టోబరు 7: అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నుంచి 29 ఎద్దులను వ్యాన్‌లో హనుమాన్ జంక్షన్‌కు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు గామన్ బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.లారీతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకుని.29 పశువులను గోశాలకు తరలించినట్టు సీఐ తెలిపారు.

గుండెపోటుతో పామాయిల్ ఫ్యాక్టరీ ఉద్యోగి మృతి

దేవరపల్లి, అక్టోబరు 7: పామాయిల్ ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి గంగయ్యప్రభు(48) గుండెపోటుతో మృతిచెందారు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం. దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన నాగిరెడ్డి గంగయ్యప్రభు యర్నగూడెం 3ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం షిఫ్ట్ ఏలో పనిచేస్తుండగా చాతిలో నొప్పి రావడంతో అతడిని ఫ్యాక్టరీ వాహనంలో దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 13 ఫిర్యాదులు

కొవ్వూరు, అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు స్వీకరించినట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి, వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది భర్తీకి చర్యలు

తాళ్లపూడి, అక్టోబరు 7: తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ సోమవారం వార్షిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్టేషన్ రికార్డుల పరిశీలన అనంతరం ఎస్‌ఐ రామకృష్ణ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తాళ్లపూడి మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌పై ప్రస్తావించగా సీఐ విజయ బాబుతో ఆరాతీశారు. దీనిపై ఆలోచిస్తామని ఎస్‌ఐ రామకృష్ణకు పలు సూచనలు చేశారు.

ప్రపంచ శాంతికి భారత్ కృషి చేయాలి

కొవ్వూరు, అక్టోబరు 7: ప్రపంచశాంతికి భారత ప్రభుత్వం కృషి చేయాలని ఐఎఫ్‌టీయు నాయకులు డిమాండ్ చేశారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయు, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యు ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం పలు వామపక్ష పార్టీల పిలుపుమేరకు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినం పాటించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.నాగేశ్వరరావు, పీవోడబ్ల్యు నాయకురాలు ఈమని మల్లిక, పి.నాగమణి, ఐఎఫ్‌టీయు నాయకులు ఈమని గ్రీష్మకుమార్, జి.నూకరాజు, చిన్న ఖతార్, పీడీఎస్‌యు నాయకులు ఎస్ఎస్‌వీ మహర్షి, మణిందర్ పాల్గొన్నారు.

సొసైటీలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, అక్టోబరు 7: దొమ్మేరు సొసైటీలో నగదు, మోడెమ్‌లు చోరీ చేసిన నిందితుడిని పట్టణ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కొవ్వూరు మండలం దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ గొడౌన్‌లో రూ.10వేల నగదు, బీఎస్ఎన్ఎల్ మోడెం, సీసీ కెమేరాల డీవీఆర్‌లను దొంగిలించిన ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దగొన్నూరు గ్రామానికి చెందిన గుబ్బిలి సుబ్రహ్మణ్యంను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.5వేలు రికవరీ చేసి, రిమాండ్ నిమిత్తం కొవ్వూరు కోర్టులో హాజరుపర్చినట్టు పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.